సాక్షి
కుమురం భీం

గురువారం । 13 । ఏప్రిల్ । 2023



వాట్సాప్ గ్రూపులపై నజర్

సోషల్ మీడియా గ్రూపులపై పోలీసులు దృష్టి సారించారు. అభ్యంతరకరమైన పోస్టులు చేస్తున్న వారిపై కేసు నమోదు చేస్తున్నారు.

8లో▸



జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని జేపీఎస్‌లు డిమాండ్ చేశారు. మండల కేంద్రాల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

9లో▸



వాతావరణం

జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పగటిపూట వేడి అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

జిల్లాకు సీఐ బదిలీ

ఆసిఫాబాద్: జోన్– 1 పరిధిలో పలువురు సీఐలు బదిలీ అయ్యారు. జగిత్యాల సీఐగా విధులు నిర్వర్తిస్తున్న కె.కిషోర్ జిల్లాలో ఖాళీగా ఉన్న డీఎస్‌బీకి బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: ఉపకరణాల మంజూరుకు దివ్యాంగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి సావిత్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు ఈ నెల 25లోగా https://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొత్తం 12 రకాల వికలాంగత్వంతో బాధపడుతున్న వారికి ఉపకరణాలు అందజేస్తామని తెలిపారు.

అలరించిన కవి సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న కవులు

ఆసిఫాబాద్: బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. ఈ సందర్భంగా పలువురు కవులు తమ కవితలను ప్రదర్శించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కవులు ఇందారపు మధుకర్, చిలుకూరి రాధాకృష్ణ, శ్రీరాం సత్యనారాయణ, ఢిల్లీ విజయ్‌కుమార్, వైద్య పూర్ణ చందర్, కిల్లి వెంకట్రావు, డి.వివేక్, సిబ్బంది వెంకటరమణ, సతీదేవి, సదానందం, మజీద్, సలీం, రామయ్య పాల్గొన్నారు.

'పది' ఒకేషనల్ పరీక్షకు 240 మంది హాజరు

ఆసిఫాబాద్‌అర్బన్: పదో తరగతి ఒకేషనల్ విద్యార్థులు బుధవారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా కొనసాగినట్లు డీఈవో అశోక్ తెలిపారు. ఈ పరీక్షకు 274 మంది విద్యార్థులకు 270 మంది విద్యార్థులు హాజరు కాగా, నలుగురు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని డీఈవో పరిశీలించారు.

'ఓబీసీలకు బీజేపీ పెద్దపీట'



అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓబీసీలకు పెద్దపీట వేస్తుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి సంజయ్ గణాతే అన్నారు. కాగజ్‌నగర్ మండలం భట్‌పల్లి గ్రామంలో బుధవారం పల్లెపల్లెకు ఓబీసీ– ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఓబీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని విమర్శించారు. జిల్లా ఓబీసీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశం, మండల అధ్యక్షుడు గణపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్, నాయకులు తిరుపతి, అశోక్, బొమ్మెళ శ్రీనివాస్, పిర్సింగుల శ్రీనివాస్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ స్వశక్తి సమ్మేళనం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రిలో బుధవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ బూత్ స్వశక్తి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదిలాబాద్ బూత్ స్వశక్తి సమ్మేళనం ఇన్‌చార్జి, యువ మోర్చా జాతీయ నాయకులు సోలంకి శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లపూర్ శ్రీనివాస్ హాజరయ్యారు. పార్టీ లక్ష్యం వైపు దూసుకెళ్లడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని అంకుసాపూర్ శివారులో నిర్మిస్తున్న వైద్య కళాశాల

వైద్యకళాశాలకు గ్రీన్‌సిగ్నల్

- వచ్చే విద్యాసంవత్సరం వంద సీట్లతో తరగతులు ప్రారంభం
- అనుమతులు మంజూరు చేసిన జాతీయ వైద్య కమిషన్
- అంకుసాపూర్ వద్ద చురుకుగా సాగుతున్న నిర్మాణ పనులు
- నెరవేరనున్న జిల్లా వాసుల కల

ఆసిఫాబాద్: జిల్లాలో వైద్యకళాశాల ఏర్పాటుకు జాతీయ వైద్యకమిషన్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. జిల్లాలో విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి రావడంతోపాటు వైద్యసేవలు మెరుగుపడనున్నాయి. ఇప్పటికే భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకోగా, ఈ నెల 9న జాతీయ వైద్య కమిషన్ నుంచి అనుమతులు కూడా మంజూరయ్యాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మొదట జిల్లా ఆసుపత్రి..

ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ శివారులో నేషనల్ హెల్త్‌మిషన్ కింద రూ.60 కోట్లతో మంజూరైన 340 పడకల జిల్లా ఆసుపత్రి నిర్మాణానికి గతేడాది మార్చి 4న రాష్ట్ర వైద్యారోగ్య శాఖమంత్రి తన్నీరు హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. పనులు కూడా ప్రారంభమయ్యాయి. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది జిల్లాలకు వైద్యకళాశాలలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆసుపత్రి భవన నిర్మాణాన్ని వైద్యకళాశాలకు అనుగుణంగా మార్పు చేశారు. రూ.28 కోట్లతో నిర్మిస్తున్న వైద్య కళాశాలలో అదనంగా ఎనిమిది బ్లాకులు ఉండనున్నాయి. విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా గదుల నిర్మాణం చేపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి భవనంపై రెండో అంతస్తులో జిల్లా ఆసుపత్రి నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం 50 పడకల స్థాయిగా ఉన్న ఈ ఆసుపత్రి 330 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తారు. మెడికో విద్యార్థులకు స్థానిక ఆసుపత్రుల్లో ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వనున్నారు. జాతీయ వైద్యకమిషన్ నుంచి అనుమతులు రావడంతో నిర్మాణ పనులు వేగవంతం చేశారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జున చారితో కలసి ఇప్పటికే పలుమార్లు పనులను పరిశీలించారు. జూన్‌లోగా పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ కోర్సును ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

100 సీట్లతో ప్రారంభం

2023– 24 విద్యాసంవత్సరంలో జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో 100 మంది విద్యార్థులకు ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించనున్నారు. ఇప్పటికే ఎన్ఎంసీ బృందం జిల్లాలో సర్వే నిర్వహించింది. ఏటా కొత్తగా 100 సీట్లను పెంచుతారు. విద్యార్థులతోపాటు కళాశాలకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నిర్వహణ, బోధన సిబ్బందిని త్వరలోనే కేటాయించనున్నారు. విద్యాబోధన కోసం ప్రొఫెసర్లు, ప్రత్యేక వైద్యనిపుణులతో పాటు వైద్యసిబ్బందిని నియమించనున్నారు. వైద్య కళాశాలకు అనుబంధంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రితోపాటు మరో రెండు పీహెచ్‌సీలను అనుసంధానం చేస్తారని అధికారులు వెల్లడించారు.

మెరుగైన వైద్యం..

జిల్లాలో మెరుగైన వైద్యసేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు నిత్యం చంద్రాపూర్, మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రైవేట్ వైద్యానికి భారీగా వెచ్చించి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ తరుణంలో మెడికల్ కాలేజీ ఏర్పాటైతే అత్యవసర పరిస్థితుల్లోనూ ఇన్‌పేషెంట్ చికిత్స అందుతుంది. వైద్యనిపుణులు అందుబాటులోకి వస్తే ఖరీదైన శస్త్ర చికిత్సలు ఇక్కడే చేసేందుకు ఆస్కారం ఉంటుంది.

నెరవేరనున్న కల

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జిల్లా వాసులు చిరకాల కల వైద్యకళాశాల ఏర్పాటుతో సాకారమైంది. జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలతోపాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని స్థానికులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నా అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం వైద్య కళాశాల ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. 15 మండలాల విద్యార్థులు వైద్య విద్య కోసం హైదరాబాద్, వరంగల్‌తో పాటు సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారు. కళాశాల ఏర్పాటుతో ఉన్నత విద్య గిరిజనులకు అందుబాటులోకి రానుంది.

ప్రజలే బీఆర్ఎస్ బలగం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, పక్కన ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు
- సిర్పూర్(యూ)లో ఆత్మీయ సమ్మేళనం

నార్నూర్(ఆసిఫాబాద్): ప్రజలే బీఆర్ఎస్ పార్టీ బలగమని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. సిర్పూర్(యూ) మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా అమలు కాని పథకాలను అమలు చేస్తూ సీఎం కేసీఆర్ బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటున్నారన్నారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణపై సవతి తల్లి ప్రేమను చూపుతున్న బీజేపీకి ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు. కొత్తగా ఏర్పాటైన జిల్లాకు కుమురంభీం పేరు పెట్టడంతోపాటు రూ. 25కోట్లతో మ్యూజియం ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఆదివాసీలు ఘనంగా జరుపుకొనే దండారీ ఉత్సవాలకు ప్రభుత్వం ఏటా రూ.కోటి విడుదల చేస్తోందని తెలిపారు.

ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని ఎమ్మెల్యే సక్కు అన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఏజెన్సీలో ఆర్‌వోఎఫ్(అటవీ భూములు) సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సాగు చేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలివ్వడంతోపాటు రైతుబంధు, రైతుబీమా వర్తింపజేస్తామని వెల్లడించారు. సిర్పూర్(యూ) మండల కేంద్రం నుంచి దేవుడిపల్లి మధ్యలో వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరారని, ప్రత్యేక నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గెడం నగేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు, జెడ్పీటీసీలు అరిగెల నాగేశ్వర్‌రావు, కోవ అరుణ, ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు ఎస్పీ భీంరావుతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల నుంచి ప్రజలను ప్రత్యేక బస్సుల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతీ బస్సులో ఒక కానిస్టేబుల్, ఒక లైజన్ అధికారి నియమించాలన్నారు. మార్గమధ్యలో మంచిర్యాలలో అల్పాహారం ఏర్పాటు చేయాలని సూచించారు. మారుమూల ప్రాంతాల నుంచి బస్సులు ముందుగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. బస్సుల ముందు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్, ఎంపీడీవోలు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కృషి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- పేదలకు బియ్యం, దుస్తులు పంపిణీ



బైక్‌పై వెళ్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ మండలం మాలిని పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామమైన మానిక్‌పటార్‌ను బుధవారం సందర్శించారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని, పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు, వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత మావోయిస్టుల ప్రలోభాలకు గురికావొద్దని, వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించొద్దని కోరారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. సమస్యలు ఉంటే ప్రభుత్వం, పోలీసుల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, పిల్లలను ప్రతిఒక్కరూ చదివించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) అచ్చేశ్వర్‌రావు, డీఎస్పీ కరుణాకర్, సీఐలు నాగరాజు, సాదిక్‌పాషా, ఎస్సై సోనియా తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్ భుక్యా అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గోవింద్ నాయక్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగాలు భర్తీ కాకపోవడం దారుణమన్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి ఎలాంటి కార్యాచరణ రూపొందించలేదని తెలిపారు. నిరుద్యోగులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం, పలువురు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో లీకేజీలు, లిక్కర్, కబ్జాల మాఫియాల రాజ్యం కొనసాగుతుందని విమర్శించారు. భవిష్యత్తులో పోటీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం త్వరలో వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దపల్లి కిషన్‌రావు, నాగోరావు, షాకీర్, వాహిద్‌ఖాన్, సందీప్, నారాయణ, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు, వీఓఏలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఐకేపీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలన్నారు. రూ.10లక్షల సాధారణ బీమా, ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రతీ గ్రామ సంఘానికి పక్కా భవనాన్ని నిర్మించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేశ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, నాయకులు సునీత, రమ, రాజేందర్, జాడిబాబు తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగ



నిర్మానుష్యంగా కౌటాలలోని కుమురంభీం చౌరస్తా

భానుడు భగభగ మండుతున్నాడు. వడగాలులతో ప్రజలు అల్లాడుతున్నారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటుతుండటంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఏప్రిల్‌లోనే వడదెబ్బతో జిల్లాలో ఒకరు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది.

- జిల్లాలో పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు
- వడగాలులతో ఉక్కిరిబిక్కిరవుతున్న జనం
- బుధవారం కౌటాలలో 42.2 డిగ్రీలుగా నమోదు
- ముత్తంపేటలో వడదెబ్బతో వృద్ధుడు మృతి
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

బుధవారం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	ఉష్ణోగ్రత
కౌటాల	42.2
ఆసిఫాబాద్	41.6
బెజ్జూర్	41.5
కెరమెరి, ఎల్కపల్లి	41.1
కాగజ్‌నగర్	41.0
తిర్యాణి	40.9
వాంకిడి, రవీంద్రనగర్	40.6

కౌటాల(సిర్పూర్): సూర్యుడి ప్రతాపానికి జిల్లా నిప్పుల గుండంగా మారుతోంది. మూడు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటుతున్నాయి. గాలిలో తేమ తగ్గడంతో ఉదయం 9 గంటల నుంచే ఉక్కపోత పెరుగుతోంది. అధిక వేడికి తోడు వడగాలులు వీస్తుండటంతో జనం ఇళ్లలోనే ఉడికిపోతున్నారు. బుధవారం జిల్లాలోనే గరిష్టంగా కౌటాలలో 42.2 డిగ్రీలగా పగటి ఉష్ణోగ్రత నమోదైంది.

అల్లాడిస్తున్న సూరీడు

తీవ్రంగా పెరిగిన ఎండలు జిల్లా ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. ఉదయం 9 గంటలకే భరించలేని వేడితో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉపాధిహామీ పనులు కూడా కొనసాగుతున్న తరుణంలో వేసవి వేడి శ్రమజీవులకు గుదిబండగా మారింది. గత వారం వరకు అకాల వర్షాల ప్రభావంతో వాతావరణం చల్లగా ఉంది. మబ్బుల ప్రభావం తొలగిపోవడంతో ఎండలు ఒక్కసారిగా పెరిగాయి. ఏప్రిల్ రెండో వారంలోనే ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో మే నెలలో భానుడి ప్రతాపం ఎలా ఉంటుందోనని జిల్లావాసులు కలవర పడుతున్నారు.

రైతులు, కూలీలకు అవస్థలు..

జిల్లా వ్యాప్తంగా యాసంగి పనులతోపాటు ఉపాధిహామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. పలు చోట్ల వరి, మొక్కజొన్న, మిర్చి కోతల పనులు చివరిదశలో ఉన్నాయి. దీంతో ఎండల ప్రభావంతో కూలీలు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల కూలీలు ఉదయమే పనులకు వెళ్లి మధ్యాహ్నం వరకు ఇళ్లకు చేరుకుంటున్నారు. కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన దోని రాజుల(65) వడదెబ్బతో బుధవారం మృతి చెందారు. ఎండలు మరింత పెరిగే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

జాగ్రత్తలు అవసరం..

ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు. వీలయినంత వరకు మధ్యాహ్నంలోపే పనులు ముగించుకోవాలని సూచిస్తున్నారు.

- సాధ్యమైనంత వరకు నీడలో ఉండాలి. ఉదయం 10 గంటలకు ముందుగా లేదా సాయంత్రం వాతావరణం చల్లబడిన తర్వాత పనులు చేసుకోవాలి. ఎండలో తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లడం, టోపీ ధరించడం, కూలింగ్ కళ్లద్దాలు ధరించడం ఉత్తమం. శరీరం లవణాలు కోల్పోకుండా ఎక్కువగా నీళ్లు తాగుతూ ఉండాలి. శీతల పానీయాలకు బదులు కొబ్బరి నీళ్లు, మజ్జిగ తీసుకోవాలి. చెమటను గ్రహించి చల్లగా ఉంచే వదులైన కాటన్ దుస్తులు ధరించాలి.

ఓటరు జాబితా సక్రమంగా రూపొందించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, జిల్లా అధికారులు

ఆసిఫాబాద్: ఓటరు జాబితాను సక్రమంగా రూపొందించేందుకు కార్యాచరణ తయారు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. హైదరాబాద్ నుంచి బుధవారం ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో ఫొటో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ జాబితా నుంచి ఓటరు వివరాలు తొలగించేందుకు ఫాం– 7 ద్వారా దరఖాస్తును పూర్తి చేసి, క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులతో పరిశీలన జరిపించాలన్నారు. డూప్లికేట్ ఓటరు కార్డులు కలిగిన వారికి నోటీసులు జారీ చేసి, తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కువ ప్రాంతాల్లో నమోదైన ఓటరు వివరాలను ఒకేచోట ఉంచి మిగిలిన ప్రాంతాల్లో తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడుతూ ఓటరు నమోదు, సవరణకు వచ్చిన దరఖాస్తులను తహసీల్దార్లు, డీటీలు, అధికారులతో పరిశీలించి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాజేశం, ఆర్డీవో రాజేశ్వర్, డీపీఆర్వో కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీకి కార్యాచరణ రూపొందించుకోవాలి

ఆసిఫాబాద్: ప్రభుత్వం నియోజకవర్గానికి 1,500 చొప్పున రంజాన్ కిట్లు కేటాయించిందని, ముస్లిం మతపెద్దలు కమిటీగా ఏర్పడి కానుకలను పంపిణీ చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం ముస్లిం మతపెద్దలతో సమావేశమయ్యారు. స్థానిక ఎమ్మెల్యేల సమన్వయంతో పంపిణీకి ఏర్పాట్లు చేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ రబ్బానిని ఆదేశించారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, అబుల్ ఫయాజ్, మీర్ సాబీర్ అలీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బెల్లంపల్లిలో ముగ్గురికి కరోనా

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో కరోనా వైరస్ కలకలం రేపింది. బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో దగ్గు, జ్వరం, గొంతునొప్పితో బాధపడుతున్న 14 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి కోవిడ్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. మంగళవారం నిర్వహించిన పరీక్షల్లో బెల్లంపల్లి మండలం దుగ్నేపల్లికి చెందిన ఒకరికి పాజిటివ్ వచ్చింది. సదరు వ్యక్తులకు వైద్య సలహాలు ఇచ్చి హోం ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు. కరోనా పాజిటివ్ కేసులు బయట పడటంతో ప్రజల్లో ఒక్కసారిగా భయాందోళనలు మొదలయ్యాయి.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

చెన్నూర్‌రూరల్: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కత్తెరసాలలో చోటు చేసుకుంది. కత్తెరసాల గ్రామానికి చెందిన మల్లవేన విజయ్ (22) అదే గ్రామానికి చెందిన బాలికతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతున్నాడని ఆమె తల్లిదండ్రులు అనుమానం పెంచుకున్నారు. ఫోన్‌లో మాట్లాడితే కేసు పెట్టి జైలుకు పంపుతామని విజయ్‌ని వేధింపులకు గురిచేశారు. తనపై వచ్చిన ఆరోపణలు గ్రామంలో తెలిస్తే పరువు పోతుందని ఆందోళన చెందిన యువకుడు బుధవారం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యంకోసం అక్కడినుంచి మంచిర్యాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు.

నేడు ఉద్యోగ మేళా

ఆసిఫాబాద్అర్బన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నేడు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో ఉన్న యువజన శిక్షణ కేంద్రం(వైటీసీ)లో గురువారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో సకాలంలో హాజరు కావాలని సూచించారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9493535052, 7893616392, 9666748105 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం చొరవ చూపాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాలలో ఎస్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీనెల ఒకటో తేదీన ఉపాధ్యాయుల వేతనాలు ఖాతాల్లో జమచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, మహిళా జిల్లా అధ్యక్షురాలు పద్మజ, ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మి, కోశాధికారి సత్తయ్య, సభ్యులు మాధవి, రమేశ్, రజిత, మన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గ్రూపులపై నజర్

- అభ్యంతరకరమైన పోస్టులపై పోలీసుల నిశిత పరిశీలన
- కించపరిచే వార్తాకథనాలను పోస్టుచేసే వారిపై నిఘా
- బెల్లంపల్లిలో 8 మందిపై కేసు నమోదు

బెల్లంపల్లి: సామాజిక మాధ్యమాల గ్రూపులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. వ్యక్తిగత పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా కొన్నిపత్రికల్లో వచ్చిన కథనాల క్లిప్పింగ్‌లను సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో ఫార్వర్డ్ చేస్తున్న పోస్టులను నిశితంగా పరిశీలిస్తున్నారు. అత్యుత్సాహం ప్రదర్శించి అభ్యంతరకరమైన, తప్పుడు వార్తాకథనాలను రాసిన, క్లిప్పింగులను గ్రూపుల్లో పోస్టు చేస్తున్న వారిపై, ఆయా పోస్టులను పట్టనట్టు వ్యవహరిస్తున్న గ్రూపు అడ్మిన్‌లపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తున్నారు. బెల్లంపల్లికి చెందిన ఓ మహిళ తనపై అభ్యంతరకరమైన వార్తా కథనాలను రాసి సోషల్‌మీడియా వేదికగా గ్రూపుల్లో పోస్టు చేశారని ఈనెల 7న టూటౌన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో ముగ్గురు పాత్రికేయులు, పోస్టు చేసిన ఓ వ్యక్తి, వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లు నలుగురు ఉన్నారు.



విచ్చలవిడిగా గ్రూపుల్లో పోస్టులు

సాంకేతిక రంగం పురోభివృద్ధి చెందడంతో వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, తదితర సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో సమాచారం శరవేగంగా పోస్టు చేయడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అనేక మంది ఔత్సాహికులు గ్రూపులను క్రియేట్ చేసి సభ్యులను చేర్చుకుంటున్నారు. అడ్మిన్లు కనీసం సదరు సభ్యుడి నుంచి ముందస్తు అనుమతి కూడా తీసుకోవడం లేదు. ఇష్టారాజ్యంగా సభ్యులను చేర్చుకుని రేయింబవళ్లు ఆ గ్రూపులో పోస్టు చేస్తున్నారు. అవి ఏ అంశానికి సంబంధించినవో పరిశీలించకుండానే ఇబ్బడి ముబ్బడిగా పోస్టు చేయడంలో పోటీపడుతున్నారు. కనీస పరిశీలన కూడా చేయకుండా చేస్తున్న పోస్టుల వల్ల ఇతరుల వ్యక్తిగత పరువు, ప్రతిష్ఠతకు భంగం కలిగించేలా వ్యవహరిస్తూ వివాదాలకు కారణమవుతున్నారు. మరో అడుగు ముందుకేసి అంశం ఏదైనా సరే నిరభ్యంతరంగా గ్రూపుల్లో చర్చించుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈక్రమంలో వ్యక్తుల వ్యక్తిగత అంశాలు సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో చర్చనీయాంశంగా మారి రచ్చ రచ్చ అవుతున్నాయి. అవి అనేక రకాలుగా రూపాంతరాలు చెందుతున్నాయి. వివాదాస్పద, విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉన్న అంశాలు, అసభ్య పోస్టులను గ్రూపుల్లో షేర్‌చేయడం తప్పని తెలిసినా అనేకమంది మానడంలేదు. ఇతరుల కన్నా తామే ముందుగా షేర్ చేయాలన్న ఉబలాటంలో అవివేకంగా వ్యవహరిస్తూ తప్పుడు వార్తల వ్యాప్తికి కారణమవుతున్నారు. ఇటీవల బెల్లంపల్లిలో ఆరిజిన్ డెయిరీ వ్యవహారంలో సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో అనేక పోస్టులు నిత్యకృత్యంగా విరాజిల్లిన విషయం తెలిసిందే.

ఇలా వ్యవహరిస్తే తప్పే

వాట్సాప్, ఫేస్‌బుక్, తదితర గ్రూపుల్లో అడ్మిన్‌లు, సభ్యులు నియమ నిబంధనలకు కట్టుబడి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంటుంది. అవగాహన లేని, పూర్తిగా తెలియని సమాచారాన్ని గ్రూపుల్లో పోస్టు చేయరాదు. తప్పుదారి పట్టించే విధంగా ఉన్న సమాచారం గ్రూపులో పోస్టు చేసినా నేరమే అవుతుంది. వ్యక్తులను కించపరిచే విధంగా ఉన్నవి, అసభ్యకరంగా ఉన్నవి షేర్ చేయడం సరైందికాదు. మరీ ముఖ్యంగా వదంతులు వ్యాప్తించే విధంగా ఉన్న అంశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పోస్టు చేయవద్దు. నిర్లక్ష్యంగా వ్యవహరించి మరొకరిని క్షోభకు గురి చేయవద్దు. ఫొటోలను మార్ఫింగ్ చేసి ఇతరుల పరువుకు భంగం కలిగించడం చట్టరీత్యా నేరం అవుతుంది. అందుచేత అడ్మిన్లు గ్రూపు సభ్యులను ఎంపిక చేసుకోవడంలో నిశిత దృష్టి కలిగి ఉండాలి. తప్పుడు సమాచారం షేర్ చేస్తున్న సభ్యులను వెంటనే గ్రూప్ నుండి రిమూవ్ చేయడంతో పాటు ప్రతీ సభ్యుడు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలి.

భంగం కలిగిస్తే చర్యలు



సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో వ్యక్తుల పరువుకు భంగం కలిగించేలా పోస్టులు పెడితే ఊరుకునేది లేదు. బాధితుడు ఫిర్యాదు చేస్తే ఎంతటి వారైనా సరే చట్టపరంగా కేసులు నమోదు చేస్తాం. బాధ్యులైన గ్రూప్ అడ్మిన్‌లతో పాటు పోస్టు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించి శాంతిభద్రతలకు భంగం కలుగకుండా తోడ్పాటు అందించాలి.

– పంతాటి సదయ్య, ఏసీపీ, బెల్లంపల్లి

పీజీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఎస్‌డీఎల్‌సీఈ పీజీ పరీక్షల్లో బుధవారం ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. సదరు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడ్డారని కాకతీయ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ కంట్రోలర్ మల్లారెడ్డి తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి



రాజులు (ఫైల్)

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన దోని రాజులు (65) బుధవారం వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజులు ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం గ్రామ సమీపంలోని పంటచేనుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తర్వాత తీవ్ర అస్వస్థతకు గురై పలుమార్లు వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

అబుదాబిలో చింతగూడ వాసి మృతి



శివకుమార్ (ఫైల్)

జన్నారం(ఖానాపూర్): జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన నరెందుల శివకుమార్ (42) అబుదాబిలో గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, దుబాయ్‌లోని స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శివకుమార్ నాలుగేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్‌లోని అబుదాబికి వెళ్లాడు. బుధవారం తెల్లవారు జామున గుండెపోటు రావడంతో తోటి కార్మికులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య శోభ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహం స్వగ్రామానికి చేరేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు భూమన్న కోరారు.

గుడుంబా విక్రేతల బైండోవర్



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వేమనపల్లి(బెల్లంపల్లి): మండలంలోని కొత్తపల్లి, నీల్వాయి గ్రామాలకు చెందిన గుడుంబా విక్రేతలను బుధవారం తహసీల్దార్ రాజ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. ఇటీవల 'సాక్షి'లో 'ఎక్సైజ్ వాళ్లకే డబ్బులు ఇచ్చినమ్.. మీరు ఏం చేస్తారు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. టాస్క్‌ఫోర్స్ సీఐలు మహేందర్‌సింగ్, గంగారెడ్డి కొత్తపల్లిలో సోదాలు నిర్వహించారు. గుడుంబా విక్రేతలు దుర్గం లచ్చయ్య, గంగారాం, నారాయణ, పద్మను బైండోవర్ చేశారు.

సైనిక్ పాఠశాలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న సీఐ సంజీవ్

నస్పూర్(మంచిర్యాల): సైనిక్ పాఠశాలలో ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో నస్పూర్ పట్టణంలోని శ్రీరాంపూర్‌కు చెందిన బత్తుల జశ్వంత్ అత్యంత ప్రతిభ కనబర్చాడు. కరీంనగర్ జిల్లా రుక్మాపూర్‌లోని సైనిక్ పాఠశాలలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా మంచిర్యాల రూరల్ సీఐ టి.సంజీవ్ బుధవారం విద్యార్థిని అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సృష్టి ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ అంబాల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్‌కే1ఏను తనిఖీ చేసిన అధికారులు



తనిఖీలో పాల్గొన్న అధికారులు

రామకృష్ణాపూర్(చెన్నూర్): మాన్‌సూన్ ఆడిట్‌లో భాగంగా మందమర్రి ఏరియాలోని ఆర్‌కే1ఏ గని సర్ఫేస్ ప్రాంతాన్ని బుధవారం అధికారులు తనిఖీ చేశారు. గని పరిసర ప్రాంతాల్లో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. రామగుండం సేఫ్టీ ఆఫీసర్ వెంకటరమణ, సర్వే ఆఫీసర్ జైనులాబుద్దీన్, జూనియర్ ఇంజినీర్ రాజేశం, గని మేనేజర్ శ్రీధర్‌రావు, ఎస్‌వో జయంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రూ.4 వేల జరిమానా

భీమిని: మహిళపై దాడి కేసులో మండలంలోని వీగాం గ్రామానికి చెందిన గాండ్ల అంకమ్మకు బుధవారం బెల్లంపల్లి సివిల్ కోర్టు జడ్జి హిమబిందు రూ.4 వేల జరిమానా విధించారు. 2016లో వీగాం గ్రామానికి చెందిన దుమ్మ రాజమ్మపై దాడి చేసిన ఘటనలో గాండ్ల అంకమ్మపై కేసు నమోదు కాగా విచారణలో నేరం రుజువు కావడంతో జరిమానా విధించినట్లు భీమిని ఎస్సై మహేందర్ తెలిపారు.

ఆర్టీసీ బస్సులోంచి పొగలు



పొగలు రావడంతో బస్సు దిగిన ప్రయాణికులు

కాగజ్‌నగర్‌టౌన్: ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ29జడ్ 1760)లో నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. బుధవారం రాత్రి కాగజ్‌నగర్ బస్టాండ్ నుంచి ఆసిఫాబాద్‌కు 40 మంది ప్రయాణికులతో బస్సు బయలుదేరింది. బస్టాండ్ సమీపంలోనే ఒక్కసారిగా ఇంజిన్ నుంచి పొగలు రావడంతో డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు కిందకు దిగారు. ఇంజిన్‌లో సాంకేతిక లోపం కారణంగానే పొగలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. బస్సును బస్టాండ్‌లోనే నిలిపివేసి మరో బస్సులో ప్రయాణికులను ఆసిఫాబాద్‌కు తరలించారు.

జార్జిరెడ్డి ఉద్యమస్ఫూర్తితో ముందుకెళ్లాలి



నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

బెల్లంపల్లి: విద్యార్థి అరుణతార జార్జిరెడ్డి ఉద్యమస్ఫూర్తితో విద్యార్థులు ముందుకెళ్లాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డిచరణ్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి 51వ వర్ధంతి నిర్వహించారు. ముందస్తుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 వరకు జరిగే వర్ధంతి సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మనోహర్, వినోద్, కళాశాల కమిటీ సభ్యులు నితిన్, రఘు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్ కార్మికుల గోడు పట్టేదెవరికి?

- గతేడాది డిసెంబర్‌లో నిలిచిపోయిన ఉత్పత్తి
- ఉపాధి కోల్పోయిన కార్మికులు
- నాలుగు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు



శాలివాహన పవర్‌ప్లాంట్‌లో నిరాహారదీక్ష చేస్తున్న కార్మికులు

పాతమంచిర్యాల: పాత మంచిర్యాల శివారులోని రంగపేటలో ఉన్న శాలివాహన గ్రీన్ ఎనర్జీ బయోమాస్ పవర్‌ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిచిపోవడంతో పాటు నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తమ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. పవర్‌ప్లాంట్‌లో సుమారు వందమంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. కంపనీ పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ 2022 డిసెంబర్ 6వ తేదీతో ముగియడంతో యాజమాన్యం ఉత్పత్తి నిలిపివేసింది. దీంతో అప్పటి నుంచి కార్మికులకు ఉపాధి కరువైంది. వేతనాలు, బోనస్ ఇప్పించాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, వరంగల్‌లో జాయింట్ లేబర్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని కార్మికులు వాపోతున్నారు. పలుమార్లు కార్మిక సంఘాల నాయకులు ప్లాంట్ యాజమాన్యంతో మాట్లాడినా వారి నుంచి స్పందన లేకపోవడంతో గత్యంతరంలేక మూడు రోజులుగా కంపెనీ ఆవరణలో నిరాహారదీక్షకు పూనుకున్నారు. స్పందించిన పవర్‌ప్లాంట్ డైరెక్టర్ మల్క నవీన్ ఈ నెల 12న కార్మికులకు రావాల్సిన జీతాలు, బోనస్ చెల్లింపుల విషయం మంచిర్యాలకు వచ్చి మాట్లాడతామని హామీ ఇచ్చాడు. ఆయన రాక పోగా కార్మికులపై రామగుండం సీపీకి ఫిర్యాదు చేశాడు. దీంతో బుధవారం మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి కార్మికులను పిలిపించుకుని ఈ నెల 15న రామగుండం సీపీ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. దీంతో తాము శాంతియుతంగా పోరాటం చేస్తుంటే యాజమాన్యం తమను అణగదొక్కాలని చూస్తోందని కార్మికులు ఆరోపిస్తున్నారు. తమకు వేతనాలు, బోనస్ చెల్లించని పక్షంలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మల్క కొమురయ్యకు చెందిన హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్, ఢిల్లీ ఇంజినీరింగ్ కాలేజీ, పల్లవి మోడల్ స్కూల్ ఎదుట నిరసనలు చేపడుతామన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

వేతనాలు చెల్లించాలి



20 ఏళ్లుగా కంపెనీలో పనిచేస్తున్నాం. పవర్ ప్లాంటే మాకు జీవనాధారం. ప్లాంటులో ఉత్పత్తి నిలిచిపోవడంతో జీతాలు రావడంలేదు. దీంతో కార్మికుల కుటుంబాలు దుర్భరస్థితిలో ఉన్నాయి. మా పరిస్థితులను అర్థం చేసుకుని మాకు రావాల్సిన వేతనాలు చెల్లించాలి.

– కుంటాల శంకర్, కార్మిక సంఘం అధ్యక్షుడు

ఉత్పత్తి కొనసాగించాలి



మాప్రాంతంలో పవర్‌ప్లాంట్ ఏర్పాటైతే మాకు ఉపాధి దొరుకుతుందని కంపెనీ నిర్మాణం కోసం రెండెకరాల భూమి ఇచ్చాం. కంపెనీలో 20 ఏళ్లుగా పనిచేస్తున్నా. వచ్చే జీతంపైనే ఆధారపడి బతుకుతున్నాం. జీతాలు లేక పూటగడవని పరిస్థితి ఎదురైంది. ఉత్పత్తి కొనసాగేలా చర్యలు తీసుకోవాలి.

– సత్యనారాయణ, కార్మికసంఘం జనరల్ సెక్రటరీ

ముంపు బాధితులకు పరిహారం ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో భూములు కోల్పోయిన బాధిత కుటుంబాలకు 14 ఏళ్లు దాటినా రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ఇవ్వడంలేదన్నారు. అప్పటి కాంగ్రెస్, ఇప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వాలు నష్టపరిహారం చెల్లించకుండా కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నాయన్నారు. అప్పటి ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, ఇప్పటి ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కమీషన్లు దండుకుని పేద ప్రజలకు అన్యాయం చేశారని ఆరోపించారు. ముంపు బాధితులకు రావాల్సిన పెండింగ్ పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బొప్పు కిషన్, దామెరకుంట నర్సయ్య, శ్రీరామ్, భూమేష్, ముదాం మల్లేశ్, రెడ్డిమల్ల అశోక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు ఉపకరణాలు

మంచిర్యాలటౌన్: దివ్యాంగులకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఉపకరణాలు అందించనుంది. దివ్యాంగులు, బధిరులు, అంధులు, మానసిక దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేయనుంది. ఉపకరణాల కోసం https://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 11నుంచి 25వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. దరఖాస్తులను జిల్లా ఎంపిక కమిటీ పరిశీలించి అర్హుల జాబితాను రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తారు. ఎంపికైన అర్హులకు ఉచితంగా ఉపకరణాలు అందిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల ఆదాయం పరిమితి ఉండాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారు సంబంధిత ధ్రువపత్రాలను జిల్లా సంక్షేమ అధికారి మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంచిర్యాల జిల్లా కార్యాలయంలో అందించాలని అధికారులు పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య తెలిపారు.

జిల్లాకు 135 ఉపకరణాలు

అర్హత కలిగిన దివ్యాంగులకు అందించేందుకు గాను జిల్లాకు 135 పరికరాలు మంజూరయ్యాయి. ఇందులో రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వెహికిల్స్ 10, బ్యాటరీ వీల్‌చైర్లు 8, ల్యాప్‌టాప్‌లు 5, మూడు చక్రాల రిక్షాలు 19, సాధారణ వీల్‌చైర్‌లు 3, చంక కర్రలు 37, చేతికర్రలు 15, డైసీ ప్లేయర్లు 1, బధిరులకు శ్రవణ యంత్రాలు(హియరింగ్ ఎడ్స్) 13, స్మార్ట్ కేన్స్ 3, టీఎల్ఎం కిట్స్ 8, 4జీ స్మార్ట్ ఫోన్లు 13 ఇవ్వనున్నారు.


అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ అభినందనీయం



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్

నస్పూర్(మంచిర్యాల): జిల్లాకు చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చడం అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఇజ్రాయిల్‌లో జరిగిన బీడబ్ల్యూఎఫ్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న స్థితప్రజ్ఞారెడ్డి, గోవాలో జరిగిన మాస్టర్–70 ప్లస్ జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించిన పళ్లెం రాజలింగులను నస్పూర్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పళ్లెం రాజలింగు త్వరలో కొరియాలో జరుగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని జిల్లాలోని మిగతా క్రీడాకారులు క్రీడారంగంలో మరింత నైపుణ్యం ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, జిల్లా క్రీడా, యువజనశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు వాసు, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మధు, అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీ కార్యకలాపాలపై ఆరా



జెడ్పీ సీఈవో నరేందర్‌ను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ట్రెయినీ కలెక్టర్ గౌతమి

మంచిర్యాలటౌన్: జిల్లాకు వచ్చిన ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి వాటికి సంబంధించిన అంశాలను తెలుసుకుంటున్నారు. అందులో భాగంగా బుధవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు? జెడ్పీ నిధులను గ్రామాలకు ఏ రకంగా కేటాయిస్తారు? వివిధ అభివృద్ధి పనులను జెడ్పీ సమావేశాల్లో నిర్ణయించి చేపట్టే అంశాలను జెడ్పీ సీఈవో కే.నరేందర్‌ను అడిగి తెలుసుకున్నారు.